ఉత్తమ సేవలకుగాను అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రంగారెడ్డి, శంకర్, కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్





ఉత్తమ సేవలకుగాను అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న శాసనసభాపతి ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి









# ఉత్తమ సేవలకు దక్కిన గౌరవం

**78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గురువారం అంగరంగ వైభవంగా జరుపుకొన్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులు, పోలీసులు, పారిశుధ్య సిబ్బందికి రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యేలు ప్రశంసాపత్రాలను అందించారు.**

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

### విద్యుత్తు స్తంభాలకు అలంకరణ పనులు చేస్తుండగా..

యాలాల, ఆగస్టు 15 : తాండూరులో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో గురువారం విషాదం చోటుచేసుకున్నది. విద్యుదాఘాతంతో ఓ ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ ఆధ్వర్యంలో స్తంభాలకు విద్యుత్తు దీపాల అలంకరణ పనులు రెండు రోజులుగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం కూడా ఈ పనులు కొనసాగాయి. హైదరాబాద్‌కు చెందిన వహీద్ అనే వ్యక్తి కాంట్రాక్టు పొంది పనులు చేయిస్తున్నాడు. హైదరాబాద్ రోడ్డు మార్గంలో సెంట్రల్ లైటింగ్ స్తంభానికి విద్యుత్తు అలంకరణ చేస్తుండగా ఫారుక్ అనే యువకుడికి షాక్ తగిలి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా రోడ్డు మధ్యలో మృతి చెందాడు. ఈ ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. అంతకుముందు ఆసుపత్రిలో ఉండగా మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న అతడిని పరామర్శించారు.

## రైతు వేదికలో చోరీ

బంట్వారం, (కోట్‌పల్లి) : రైతువేదికలో చోరీ జరిగింది. దొంగలు తలుపులు పగులగొట్టి సామగ్రిని తస్కరించారు. ఆ ఘటన కోట్‌పల్లి ఠాణా పరిధిలో గురువారం జరిగింది. మండలంలోని రాంపూర్ రైతువేదికలో గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి అందులో ఉన్న ఎలక్ట్రికల్ సామగ్రి, సౌండ్ బాక్స్ కీ బోర్డ్, టీవీ కెమెరా హ్యాండ్ రిమోట్లను తస్కరించినట్లు ఏఈవో శారద పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాటి విలువ సుమారు రూ. 15 వేల పైగా ఉంటుందన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దోమలో జాతీయ జెండాను ఆవిష్కరించని స్త్రీ శక్తి భవనం

### ప్రభుత్వ కార్యాలయాలపై

## ఎగురని జాతీయ జెండా

దోమ, ఆగస్టు 15 : పంద్రాగస్టు వేడుకల సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనం(ఉపాధి హామీ భవనం)తోపాటు మండలవ్యాప్తంగా ఉన్న 8 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించలేదు. ఉన్నత స్థాయి అధికారుల నిర్లక్ష్యంతోనే కింది స్థాయి ఆఫీసర్లు ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేయకుండా అవమానపరిచారని ఆయా గ్రామాల ప్రజ లు, నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించకుండా నిర్లక్ష్యం చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## ప్రభుత్వం హామీలు నెరవేర్చుతున్నది

### పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఆగస్టు 15 : మండలంలోని గడిసింగాపూర్ రైతువేదికలో రెండు లక్షల రుణమాఫీ సంబురాల్లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినట్లు రెండు లక్షల రుణ మాఫీ ప్రక్రియను ఆగస్టు 15 వరకు ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. మిగిలిన ఆరు హామీలను కూడా నెరవేర్చుతామని.. ఇప్పటికే ఐదు హామీలను నెరవేర్చినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో పరిగి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. ఇప్పటికే రైల్వేలైన్ ఏర్పాటుకు పనులు ప్రారంభమయ్యాయన్నారు. నియోజకవర్గంలో 27,207 మంది రైతులకు రూ. 237.49 కోట్ల రుణమాఫీ జరిగిందని, వికారాబాద్ జిల్లాలో 97,667 మంది రైతులకు రూ. 905.02 కోట్ల రుణమాఫీ చేశామన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ రుణమాఫీ కాని అర్హులైన రైతులు మండలాల్లోని రైతువేదికల్లో అందు బాటులో ఉండే వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అర్హులందరికీ రుణ మాఫీ అయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా వ్యవసాయాధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




గడిసింగాపూర్‌లో రెండులక్షల రుణమాఫీ సంబురాల్లో పాల్గొని మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

## పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

### శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఆగస్టు 15 : వికారాబాద్ పట్టణ పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం(ప్రజాభవన్)లో వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మంజులారమేశ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్ దుస్తులు, రైన్‌కోట్లు, గ్లౌజ్‌లు, బూట్లు, కొబ్బరి నూనె, డిటర్జెంట్ సబ్బులు, టూత్ పేస్ట్‌లు, డెటాల్ సబ్బులు, టూత్ బ్రష్‌లు, టవల్స్, రేడియం జాకెట్లను స్పీకర్ ప్రసాద్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జాకీర్‌అహ్మద్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్ దుస్తులు, ఇతర సరుకులు అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

### ఎస్ఈ కార్యాలయం ప్రారంభం

వికారాబాద్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీ రాజ్ శాఖ (పీఆర్) సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) కార్యాలయాన్ని గురువారం శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు.

# సైబర్ కాప్స్ స్పీడ్ తగ్గింది

- 1930పైనే ఆధారపడుతున్న పోలీసులు
- ఏడాది కిందట ప్రశంసలు.. నేడు విమర్శలు
- వనరులున్నా.. పట్టించుకోని వైనం
- కేసు నమోదుతోనే సరిపుచ్చుకుంటున్న తీరు
- రూ. కోట్లు పోతున్నాయి.. వేలల్లో రికవరీతో సర్దుబాటు




సిటీబ్యూరో, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): సైబర్‌నేరాల్లో పోతుంది కొండంత అయితే.. రికవరీ మాత్రం గోరంతగా ఉంటున్నది. జీరో అవర్‌లో కాల్ చేయలేదంటే.. మేం ఏం చేయలేమన్నట్లు సైబర్‌క్రైమ్ పోలీసులు వ్యవహరిస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో దేశవ్యాప్తంగా తెలంగాణ సైబర్‌క్రైమ్ పోలీసులు హడల్ ఎత్తించేవారు. వేగంగా కేసుల నమోదుతో పాటు నేరగాళ్లు ఎక్కడున్నా వాళ్ల ఆటకట్టించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. సైబర్‌నేరగాళ్లు రోజుకో కొత్తపంథాల్లో దోచుకుంటున్నా.. కేసుల నమోదుతోనే పోలీసులు సరిపుచ్చుతున్నారు. దర్యాప్తులోనూ వేగం తగ్గింది. బాధితుల డబ్బులు రికవరీ విషయంలో 1930పైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. రూ. కోట్లు పోతున్నా..రికవరీలు మాత్రం వేలల్లోనే ఉంటున్నాయి.

### ఏడు నెలల్లో సుమారు 5వేల కేసులు..

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్లలోని సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్లలో ఈ ఏడాది మొదటి ఏడు నెలల్లో సుమారు 5 వేల వరకు కేసులు నమోదయ్యాయి. వీటికి ఆయా శాంతి భద్రతల పోలీస్‌స్టేషన్లలో నమోదయ్యే కేసులు అదనం. ఇందులో 2 వేల వరకు సోషల్‌మీడియా, ఇతరాత్ర ఉన్నా.. 3 వేల వరకు మాత్రం ఆర్థికంగా నష్టం జరిగిన కేసులు నమోదయ్యాయి. ట్రై కమిషనరేట్ల పరిధిలో ప్రతి నెల రూ. 20 కోట్ల నుంచి రూ. 25 కోట్లు వరకు నష్టం జరుగుతున్నది. ఇందులో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఫెడెక్స్, ట్రేడింగ్ మోసాల్లో ఎక్కువగా నష్టం వాటిల్లుతున్నది.

### 1930పైనే ఆధారం..

సైబర్‌నేరాలు జరిగిన వెంటనే జీరో అవర్‌లో 1930కి, నేషనల్ సైబర్‌క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే.. పోయిన సొత్తు వెనక్కి వచ్చేందుకు అవకాశాలుంటాయి. బాధితులు పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే.. సైబర్ నేరగాళ్లకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ అయితే అదృష్టం. ఒకవేళ నిందితుల ఖాతాల్లో డబ్బు ఆగలేదంటే.. బాధితులకు నగదు రావడం గగనమే అవుతుంది. అయితే సైబర్‌క్రైమ్ పోలీసులు కూడా పూర్తిగా 1930పైనే ఆధారపడుతున్నారు.


### పక్క రాష్ట్రాల మాదిరిగానే..

సైబర్‌నేరం జరగగానే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం కేసు నమోదు చేసి పక్కన పడేయడం చేస్తుంటారు. ఇది పొరుగున ఉండే చాలా రాష్ట్రాల్లో గతంలో జరిగేది. కేసుల నమోదుతో పాటు రికవరీలో కూడా తెలంగాణ పోలీసులు గతంలో బేషుగ్గా పనిచేశారు. నేడు సమర్థులైన అధికారులున్నా.. తమకెందుకులే అన్న చందంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని కేంద్రాల్లోని అధికారులకు సైబర్‌నేరాలపై అవగాహన లేకున్నా పోస్టింగ్‌లు ఇచ్చి కూర్చోబెడుతున్నారనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. సైబర్‌నేరాల్లో దొంగలు దొరికేది ఉందా? ఎవరో ఖాతాదారుడు మాత్రమే దొరుకుతాడు. ఇక మనం ఢిల్లీ, రాజస్థాన్‌కు వెళ్లి చేసేదేముందనే వాదన కూడా కొందరు పోలీసులు వినిపిస్తున్నారు.

### మార్పు మొదలైంది..

## వలసలు పెరుగుతాయి

### బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి



కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

షాబాద్, ఆగస్టు 15 : తెలంగాణలో మార్పు మొదలైందని, బీఆర్ఎస్ పార్టీలోకి వలసలు పెరుగుతాయని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడు అభిషేక్ ఆధ్వర్యంలో చేవెళ్ల, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలకు చెందిన పలువురు ఎన్ఎస్‌యూఐ నాయకులు కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు విస్మరిస్తూ.. కేవలం రాజకీయాలకు మాత్రమే యువతను వాడుకుంటున్నదని ఆరోపించారు. కొంతమంది ఎమ్మెల్యేలు, నాయకులు స్వార్థం కోసం పార్టీలు మారుతుంటే యువత మాత్రం కేసీఆర్ వెంటే నడవాలని నిర్ణయించుకుంటున్నారన్నారు. అనంతరం బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దశరథ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బతుకులు మారుతాయని యువత భావించిం దని.. కానీ, అలవికాని హామీలిచ్చి అందరినీ ఆగం చేస్తున్నదని మండిపడ్డారు. ఎన్ఎస్‌యూఐ నుంచి బీఆర్‌ఎస్వీలో చేరుతున్న విద్యార్థి నాయకులందరికీ సముచిత న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధి మాజీ సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని, రానున్న రోజుల్లో పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్వీలో చేరికలు జరుగుతాయని ఎన్ఎస్‌యూఐ నాయకులు పేర్కొన్నారు.

### ఔటర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

## ముగ్గురి మృతి

శంషాబాద్ రూరల్, ఆగస్టు 15 : ఔటర్ రింగ్‌రోడ్డుపై గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఈ ప్రమాదం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏసీపీ శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం.. కరీంనగర్ నుంచి కారులో ఐదుగురు యువకులు కలిసి ఎయిర్‌పోర్టుకు వెళ్తున్నారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో అతివేగంగా నడిపాడు. శంషాబాద్ మండలం పెద్ద గోల్కొండ గ్రామ సమీపంలోకి రాగానే ముందుగా వెళ్తున్న కారును ఢీకొని.. ఆ తర్వాత ముందుకు దూసుకెళ్లి తుఫాన్ వాహనాన్నీ ఢీకొట్టింది. దీంతో ఆ వాహనం మూడు పల్టీలు కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తో తాజ్(40), వరలక్ష్మి(45), 2 నెలలు బాలుడు, తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. తుఫాన్ వాహనంలో ప్రయాణిస్తున్న 13 మంది ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు కలిసి తుఫాన్ వాహనంలో యాదగిరిగుట్టకు దేవ దర్శనానికి వెళ్లి, తిరిగి ఇంటికి వెళ్తుండగా పెద్ద గోల్కొండ వద్ద ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. మరో ఆరుగురికి గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి కూడా విషమంగానే ఉన్నదని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### అతివేగమే ప్రమాదానికి కారణం..

కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు యువకులు అతివేగంగా కారును డ్రైవింగ్ చేసి ముందుగా వెళ్తున్న కారును, తూఫాన్ వాహనాన్ని ఢీకొట్టారని ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.



## విద్యార్థినులకు నగదు బహుమతి

చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన దుద్యాల మండల కేంద్రానికి చెందిన జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు అస్మిత, సంగీతలకు గురువారం జిల్లా కేంద్రంలో శాసనసభాపతి ప్రసాద్‌కుమార్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నగదు బహుమతులు అందించి అభినందించారు.

-బొంరాస్‌పేట, ఆగస్టు 15

## వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ

పెద్దేముల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి ఆంగ్ల మీడియంలో చదువుతూ వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థి మహ్మద్ షాహెద్‌కు గురువారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ చేతులమీదుగా నగదు బహుమతిని అందించారు.

-పెద్దేముల్, ఆగస్టు15

